# పెళ్ళిచూపులు

పావులూరి శివాజీ

''ఇదుగో! అమ్మాయ్! రేపే నీ పెళ్ళిచూపులు... ఇదే నీక్కాబోయే మొగుడి ఫోటో...'' అంటూ తండ్రి ఇస్తున్న కవర్ హుషారుగా అందుకుని లోపలిగదిలోకి పరుగుతీసింది శ్రీరంజని.

బుట్టబొమ్మలా బెడ్‌మీద కూర్చుని రెండు కళ్ళు పెద్దవి చేసి చూస్తూ నెమ్మదిగా ఆకవర్‌ని అటూ ఇటూ తిప్పింది.

కవర్ లోపలున్న ఫోటోని వెలికి తియ్యబోతూ క్షణం ఆగింది!

ఎన్నేళ్ళనుంచో తను కన్నకలలు... ఎన్నో మెట్లుగా కళ్ళముందు మెదుల్తున్నాయి. ఆశలు... ఊహలు... ఉత్సాహం... ఉద్వేగాల సముద్రాలు దాటి ఎక్కడో ఆకాశాన చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తున్నాయి ఆలోచనలు...

పద్దెనిమిదేళ్ళ పరువంలో ఏపుగా పెరిగిన తన అందాల్ని... మరికొద్ది రోజుల్లో తనక్కాబోయే ఓ పురుషుడి ముందు...! పాలరంగు తెల్లచీరలో అతి భద్రంగా చుట్టి... ఆకాశంలో నక్షత్రాలు కోసి కురుల మధ్య తురుముకుని... ఆ పురుషుడి ముందు...!

ఆ కవర్‌లోవున్న పురుషుడి ముందు...!!

కిటికీలోంచి వీస్తున్న గాలి చక్కిలిగింతలు పెట్టిందామెని.

ఒక్క సన్నని జలదరింపుతో ఈలోకంలోకొచ్చి కవర్ లోపలున్న ఫోటో తియ్యబోతూ మళ్ళీ ఆగింది క్షణం...!

వర్షానికి ముందు కొండల్ని మేఘాలు మింగినట్టు కొండంత సిగ్గు ఆమెని మింగింది. లేత తమలపాకుల్లాంటి రెండు చేతుల్తో కళ్ళని మూసేసి నిముషం తర్వాత క్రిందికి జార్చింది.

రెండు విద్యుత్ బల్బులు ఉప్పున పగిలినట్టు ఆమె రెండు కళ్ళు విచ్చుకున్నాయి. ఈసారి ధైర్యం చేసి నెమ్మదిగా కవర్లోంచి ఫోటోని బైటికి లాగింది.

అంతే...!!!

కలల మెట్లు పేకమేడల్లా కూలిపోయాయి. ఆశలు...ఊహలు... ఉత్సాహం... ఉద్వేగాల

సముద్రాల్లో అలజడి మొదలైంది. కొండల్ని మింగిన మేఘాలు నల్లమబ్బులై భడభడ మన్నాయి. కొండంత సిగ్గు చితికి వర్షమైంది.

ఆ ఫోటోలో వున్న మనిషికి పాతాళ భైరవి సినిమాలో మాంత్రికుడికి దగ్గర పోలిక.

నెత్తిమీద రెండు కొమ్ములు పెడితే తెలిపే రెండు కళ్ళు... వినాయకుడి ముక్కు... ఆంజనేయుడి మూతి...

శ్రీరంజనికి తన తండ్రి పద్మనాభం కళ్ళముందు కదలాడాడు. ఒక్క విసురుతో వెళ్ళి ఛెయిర్‌లో కూర్చుని ఓల్డ్‌పేపర్ తిరగేస్తున్న అతడి ముందుకి ఆఫోటోని



దున్నపోతులావుంటాడు. ఆ విశాలమైన నుదురుమీద ఎవరో చిన్నప్పుడు గుండ్రా యితో బాదినట్టు ఒక చిన్న గొయ్యి... ఒకవైపు తిరిగితే తూర్పు పడమరల్ని మరోవైపు తిరిగితే ఉత్తర దక్షిణాల్ని తెలుపక విసిరింది.

''నాన్నా! అసలు నన్నేమనుకుంటున్నావు?''

సింహగర్జనే వినిపించింది పద్మనాభానికి ఆమె సన్నటి గొంతునించి.

తన కూతురు నుంచి ఇలాంటి పరిస్థితి

ఎదురవుతుందని ఫోటోలో అబ్బాయిని కళ్ళతో చూసినప్పుడే ఊహించుకున్నాడు పద్మనాభం. ఆ యిద్దరి గురించి తెలిసిన ఒకరిద్దరు ప్రక్క ఊరి స్నేహితులు కూడా 'కారుమబ్బుకి, పున్నమి చంద్రుడికి ముడిపెట్టినట్లుంటుందీ సంబంధం' అంటూ ఉచితోక్తులు విసరకపోలేదు.

వాస్తవం ఏదైనప్పటికీ పబ్బం గడవడమే ప్రధానంగా పెట్టుకున్న పద్మనాభం ఇప్పుడవన్నీ పట్టించుకునే స్థితిలోలేడు.

ముఖంలో గాంభీర్యం నింపుకుని కూతురి వేపు చూస్తూ ''నువ్వనేదేంటో ముక్కు సూటిగా అను...'' అన్నాడు.

''మీముక్కుకు సూటిగానే చెప్తున్నాను. ఈ పెళ్లిచూపులు క్యాన్సిల్ చేయండి.''

''నోర్ముయ్! ఇంకొక్కసారి ఆమాటన్నావంటే నాలుక చీరేస్తాను. ఇన్నాళ్ళు నువ్వు కోరిందల్లా ఇచ్చి నిన్ను పెంచి పెద్దచేసింది నాకు ఎదురు తిరగమని కాదు. ఏది మంచో ఏది చెడో నాకు తెలుసు. మర్యాదగా చెప్పినట్టు నడుచుకో.''

డ్రామాలో డైలాగ్‌లా అనేసి మాటలు పెరగనీయకుండా బయటపడ్డాడు పద్మనాభం.

తన మాటలు లెక్కచేయకుండా వెళ్ళిపోతున్న తండ్రి వంక ఉక్రోషంగా చూస్తూ నిలబడిపోయింది శ్రీరంజని.

ఆయన తిరిగొచ్చాక ఆరాత్రంతా అలుగు ముఖంతోనే గడిపింది. అయినా ఆయన పట్టించుకోపోగా, తెల్లవారగానే పెళ్లిచూపులంటూ మరోసారి కరాఖండిగా చెప్పేసి మేను వాల్చాడు పడకగదిలో.

★ ★ ★

ఆ రాత్రి మరో రెండు గంటలు గడిచి అర్ధరాత్రే అయ్యింది. ఊరంతా నిద్రలోకి జారుకున్నా శ్రీరంజనికి మాత్రం కునుకు పడలేదు. బెడ్‌మీద అటూ ఇటూ పొర్లాడింది కాసేపు. నాలుగేళ్ళ క్రితం చనిపోయిన తల్లి గుర్తొచ్చి బాధాతప్త హృదయంతో కన్నీళ్ళు పెట్టింది. ''అమ్మే బ్రతికి వుంటే తననీ ముష్టివాడికిచ్చి కట్టబెట్టమంటే ససేమిరా ఒప్పుకునేది కాదు. ఆమె లేకపోవటంతో అంతా నాన్న రాజ్యమే అయిపోయింది'' అనుకుంది.

నాన్న మొండి మనిషి. తను అనుకున్నది సాధించే వరకు వదలడు. తెల్లవారాక పెళ్లిచూపులు.. ఆ మరుసటి రోజే పెళ్లి... తర్వాత ఆ బెంగుళూరు బస్సు మొహం గాడితో తన కాపురం...!

నో! అలా జరగటానికి వీల్లేదు. అది జరిగేలోపే తను నాన్న లోకం నుంచి అమ్మ లోకానికి వెళ్ళిపోవాలి.

బెడ్‌మీది నుంచి నెమ్మదిగా లేచింది శ్రీరంజని. కిటికీలోంచి అవతలి గదిలోకి చూసింది. పద్మనాభం నిశ్చలంగా నిద్రపోతున్నాడు. అడుగులో అడుగు వేసుకుంటూ బయటి ఆవరణలోకొచ్చింది.

చిక్కటి చీకటి! కరడుగట్టిన చీకటి!! భూమిని కమ్మి నభోతలాన్నంటిన చీకటి!!

యండమూరి నవల్లోలాగా ఎక్కడో ఓ కుక్క మొరుగుతున్న శబ్దం తప్ప అంతా నిశ్శబ్దం. పిన్‌డ్రాప్ సైలెన్స్.

ఆ ఆవరణకి కొద్ది దూరంలో ఇంటి

చుట్టూ వున్న ప్రహరీగోడకి దగ్గరగా ఓ మూలన వేపచెట్టు. దానిప్రక్కనే పాతాళా న్నంటే గిలకబావి.

చప్పుడు కాకుండా నడుచుకుంటూ బావి దగ్గరకి చేరుకుంది శ్రీరంజని. బావి పక్కనే నిలబడి ఓసారి వేపచెట్టువైపు చూసింది. బారులు తీరిన కొమ్మలు భూతప్రేత పిశాచగణాల్లా కనిపిస్తున్నాయి. ప్రేతకళ వుట్టిపడుతోందక్కడ.

బావివైపు తిరిగి కళ్ళు మూసుకుంది.

మరి కొద్ది నిముషాల్లో తను ఆ బావిలో దూకుతుంది. ఆ తర్వాత తన ప్రాణం నీళ్ళల్లో కలిసిపోతుంది. తన కళేబరం నీళ్ళపైన తేలుతుంది. తెల్లవారాక తన తండ్రి తనని గుర్తిస్తాడు. ఎవరో ఇద్దరు వ్యక్తులు కలిసి శవాన్ని వెలికి తీస్తారు. ఇది పల్లెటూరు కనుక పోలీస్టేషన్లు, పోస్టుమార్టమ్‌లు, పంచనామాల్తో పనిలేదు. ఆచారం ప్రకారం ఒక గొయ్యిత్రవ్వి తనని అందులో పడుకోబెడతారు. తనని పూడుస్తుండగా తన తండ్రి బోరున విలపిస్తాడు. ఆదృశ్యం చూసి ఈ చుట్టు పక్కల ఏ తండ్రీ తమ ఆడపిల్లల్ని ఈవిధంగా బలితీసుకోరు. ఆఒక్కటీ తనకి చాలు!

ఆమె ముందుకు కదలబోయింది. కాని వదల్లేదు. ఎవరో పట్టి లాగటంతో గుండె ఝల్లుమనిపించి వెనక్కి తిరిగి చూసింది.

ఆమె తండ్రి పద్మనాభం!

నెత్తిమీద పిడుగుపడ్డట్టయిందామెకి.

''నాన్నా...!'' అంది విభ్రమంగా.

★ ★ ★

ఆత్మహత్యా ప్రయత్నం చేసుకోబోయి

> ## గెటౌట్
>
> ''ఎప్పుడూ ఆయన గురించే చెబుతావు లెక్కల మాస్టరంటే నీకంత ఇష్టమెం దుకు?'' అడిగాడు చిన్నాయన.
>
> ''ఏ చిన్న తప్పు చేసినా తరగతి నుండి అవలకి పంపిస్తాడు!'' అన్నాడు విద్యార్థి.
>
> \- రశీద్ శిక్షక్
> (దోస్కాల్)

నందుకు ఇంట్లోకి తీసుకొచ్చి చాంతాడంత శరీరం కందిపోయేలా కొడతాడనుకున్న తండ్రి అలా చెయ్యలేదు.

''చూడమ్మాయ్! ఈకాలపు ఆడపిల్లల గురించి నాకు బాగా తెలుసు. నువ్విలాంటి అఘాయిత్యం ఏదో చేస్తావని రాత్రి అలుగు ముఖం పెట్టినప్పుడే గ్రహించాను. నిజం చెప్పాలంటే ఆఫోటోలోవున్న అబ్బాయి తండ్రి, నేను ప్రాణ స్నేహితులం. నిన్ను ఆ అబ్బాయికిచ్చి పెళ్ళి చెయ్యాలని నువ్వు పుట్టకముందే నిర్ణయించుకున్నాం. అయినా ముక్కు మొహం కావలసింది అమ్మాయిలకు గాని అబ్బాయిలకి కాదు. ఏళ్ళ తరబడి తిన్నా తరగని ఆస్థి వాళ్ళకుంది. నువ్వు అవునన్నా కాదన్నా ఆ అబ్బాయే నీకు మొగుడు. మరోసారి ఏ అఘాయిత్యం చేసుకోవాలని మాత్రం ప్రయత్నించకు. ఈ పెళ్ళి జరిగేవరకూ నిన్ను వెయ్యి కళ్ళతో కనిపెట్టే

ఉంటాను.''

చెప్పేసి పళ్ళు పటపట లాడించుకుంటూ వెళ్ళిపోయాడు.

చేసేదేమీలేక ఏడుపులంకించుకుంది శ్రీరంజని.

''భగవంతుడా! ఈ ఒక్క గండం నుంచి గట్టెక్కించు నన్ను...'' అనుకుంది మనసులో.

★ ★ ★

పనిమనుషుల సాయంతో ఉదయం తొమ్మిది గంటలకల్లా ఇల్లంతా శ్రద్ధగా అలంకరించాడు పద్మనాభం.

పెళ్ళిచూపుల వాళ్ళొచ్చి హాల్లో కూర్చు న్నారు.

పక్కింటి తులశమ్మ, సుబ్బమ్మలు కలిసి శ్రీరంజనికి ఓ చీర సెల్క్ట్ చేసి అద్దం ముందు కూర్చోబెట్టి తుది మెరుగులు దిద్దారు.

అదంతా తనకిష్టం లేకపోయినా తండ్రి బలవంతం కొద్దీ కూర్చుందామె. సినిమాల్లో లాగా ఒక ట్రేలో కాఫీలు తీసుకుని నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి పెళ్ళివాళ్ళ ముందుం చింది. తనక్కాబోయే వరుడ్నొక్కసారి తలెత్తి చూడాలనుకుంది కాని వాంతులొస్తున్నాయన్న ఉద్దేశంతో ఆగిపోయింది.

''అమ్మాయి అందం ముందు రంభా ఊర్వశిలు బలాదూర్...'' పెళ్ళికొడుకు తండ్రి దద్దోజన్రావు అన్నాడు.

''అదేంటండి రంభా ఊర్వసులంటారు... అమ్మాయి మహాలక్ష్మిలా ఉంటేను!'' పెళ్ళి కొడుకు తల్లి సమర్థించింది.

కాబోయే అల్లుడు మాత్రం ఏం మాట్లాడక పోవడంతో పద్మనాభంలో ఆందోళన మొదలైంది.

''నాన్నా! ఒకసారి ఇట్రా...'' అంటూ తండ్రిని వెంటబెట్టుకు బైటికెళ్ళిపోయాడు.

వాళ్ళు హఠాత్తుగా అలా వెళ్ళిపోవడంతో హాలంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది.

అయిదు నిముషాల తర్వాత దద్దోజన్రావు లోపల అడుగుపెట్టాడు. సరాసరి పద్మనాభం దగ్గరకి వచ్చి భుజం మీద చెయ్యేశాడు.

''సారీరా పద్మా! మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చలేదట. పెళ్లి క్యాన్సిల్ చెయ్యమంటున్నాడు...'' చెప్పాడు.

''దద్దూ...!'' విస్తుపోయాడు పద్మనాభం.

''అవున్రా మొదట్నించీ వాడు అదో తరహా మనిషి. మీ అమ్మాయి బాగా లేదు అని మాత్రం వాడు అన్లేదు. శ్రీదేవి, ఆమని, సౌందర్య, రంభ... లాంటి వాళ్ళయితే వాడికి నచ్చురట. విజయశాంతి, నగ్మా, రమ్యకృష్ణ, మాధురీదీక్షిత్... లాంటివాళ్ళు కావాలిట. ఏమిటోరా కలికాలం పిల్లలు...''

అంటూ వెంట తెచ్చిన బంధువుల్తోపాటు మూట, ముల్లె సర్దుకున్నాడు దద్దోజన్రావు.

పద్మనాభం మొహంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. తన పొరపాటు గ్రహించి ఈసార యినా వరుడి విషయంలో తనకూతురు కోరినట్లే చెయ్యాలనుకున్నాడు.

శ్రీరంజనికి మాత్రం పగ్గాలు తెంపుకున్న ఆంబోతు మీదపడబోతూ పక్కసందుగుండా వెళ్ళినంత పనే అయిందనిపించింది.

★